క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం, లావణ్య హాస్పిటల్, స్విమ్మింగ్ పూల్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, హన్మకొండ చౌరస్తా, గాంధీనగర్, మిషన్ హాస్పిటల్ ఎదురుగా, రెడ్డికాలనీ, గుడిబండల్, రాయపుర, మాదిరెడ్డి కుంట, కుమార్‌పల్లి పాలజెండా ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూలో 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'

కేయూ క్యాంపస్: కేయూ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విశ్వ విద్యాలయంలోని యోగా సెంటర్ సంయుక్త నిర్వహణలో ఈనెల 21న ఉదయం 6గంటలకు క్యాంపస్‌లోని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, తదితరులు పాల్గొంటారని నారాయణ వివరించారు.

రేపు కేటీఆర్‌ను కలవనున్న కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఆ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు ఈనెల 22న భేటీ కానున్నారు. వరంగల్ బల్దియా కౌన్సిల్ హాల్‌లో అధికార కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడుగడుగునా ఇరుకున పెట్టించి అడ్డుకున్నా తీరుపై సమాచారం తెలుసుకున్న కేటీఆర్.. సభ్యులకు గురువారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. బీఆర్ఎస్ సభ్యులు ఎలా వ్యవహరించాలనే విషయాలపై చర్చించనున్నట్లు సమాచారం. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, కార్పొరేటర్లు, ముఖ్యనేతలు కేటీఆర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది.

రేపు కంటి వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంగమయ్య, కేవీ.రావు తెలిపారు.

30న విశ్వ సమాజం ఆవిర్భావ సభ

నయీంనగర్: జూన్ 30న హనుమకొండ జయకృష్ణ కాన్ఫరెన్స్ హాల్‌లో విశ్వ సమాజం ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు విశ్వ సమాజ వ్యవస్థాపకుడు విశ్వ జంపాల తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభకు ముఖ్యఅతిథిగా ప్రజా కవి జయరాజు, కవి విమర్శకుడు గుంటూరు లక్ష్మీ నరసయ్య, ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు.

జూనియర్ వైద్యుల నిరసన

ఎంజీఎం: తమ సమస్యలు పరిష్కరించాలని జూనియర్ వైద్యులు సమ్మె నోటీసు ఇచ్చి గురువారం మూడోరోజుకు చేరింది. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నల్లబ్యాడ్జీల ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. శుక్రవారం నల్ల దుస్తులతో హాజరై వినూత్న పద్ధతిలో నిరసన తెలుపనున్నట్లు వైద్యులు వివరించారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మున్వర్ డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ ఎ.గీత పర్యవేక్షణలో 'డీప్ లర్నింగ్ మోడల్స్ యూజింగ్ కార్డియో వాస్క్యులర్ డిజార్డర్స్ రిస్క్ ప్రిడిక్షన్' అనే అంశంపై చేసిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చెన్నైలోని అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మున్వర్‌ను కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి సీఎస్ఈ విభాగాధిపతి నిరంజన్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రభాకరాచారి అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నర్సమ్మ (ఫైల్)

ఖిలా వరంగల్: 106 ఏళ్ల వయసులో కూడా తన పని తాను చేసుకుంటున్న వృద్ధురాలు గురువారం మృతిచెందింది. వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన అంకం నర్సమ్మ మృతికి స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాగా, నర్సమ్మకు మూడు తరాలకు చెందిన 38 మంది మనుమరాళ్లు, మనుమలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

హన్మకొండ: పొరపాటున కషాయం అనుకుని యాసిడ్ తాగి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి హనుమకొండ జులైవాడకు చెందిన సయ్యద్ హమీద్ (81) మృతి చెందాడని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. హమీద్ కుమారుడు జాహెద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

'నీట్' బాధ్యులను శిక్షించాలి



హన్మకొండ: అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



మడికొండ: మడికొండ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు



వరంగల్: పోచమ్మమైదాన్ జంక్షన్‌లో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

హన్మకొండ: వైద్యవిద్య ప్రవేశానికి నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని, నీట్ పేపర్ లీకేజీ ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. హనుమకొండ కాళోజీ జంక్షన్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో ఎన్నడూలేని విధంగా 67 మందికి 720 మార్కులకు 720 వచ్చాయని, టాప్ స్కోర్ వచ్చిన 67 మందిలో ఆరుగురు హర్యానాలోని ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయడంపై పలు అనుమానాలు తలెత్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.అశోక్ స్టాలిన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

హన్మకొండ: నీట్ పరీక్ష లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నీట్ పేపర్ లీకేజీకి నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ముందుగా రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఫలితాలపై విచారణ చేపట్టాలి

ఖిలా వరంగల్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయని, తక్షణమే నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్, ఎలేందర్, యాకూబ్, సారయ్య పాల్గొన్నారు.

మడికొండ: నీట్ పరీక్ష ఫలితాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మడికొండ చౌరస్తాలో నిరసన తెలిపారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నపత్రాలను బిహార్ రాష్ట్రంలో రూ.30 లక్షలకు అమ్ముకున్నారని, దీంతో 67 మందికి మొదటి ర్యాంక్ రావడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో పార్టీ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, బండ్లోజు రాజమణి, కోరపల్లి రమాదేవి, మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, గోకుల రాజయ్య, లకావత్ లక్ష్మి పద్మ, దుబాసి పద్మారావు, ప్రతాప్ పాల్గొన్నారు.

వరంగల్: నీట్ పరీక్ష లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ డిమాండ్ చేశారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంద్ర కుమార్, ఎండీ.కాశీం, పరికరాల రమేష్, ఐలయ్య, కొయ్యడ మనోహర్, బుల్లె సామిల్, ఎండీ.సాదిక్, శ్రీలక్ష్మి, అనూష, వసంత, భాగ్యశ్రీ, సరస్వతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానం



యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానం అమలుకు సన్నాహాలు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెమీ రెసిడెన్షియల్ విధానం అమలు ద్వారా విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్‌లు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ పాఠశాలను తీర్చిదిద్దడానికి రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. పాఠశాలల్లో కనీస సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, పెద్దమ్మ నర్సింహారాములు, మాజీ ఉప సర్పంచ్ గొర్రె రమేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, బాక్సింగ్ కోచ్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించండి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

వరంగల్: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. టీజీ ఐపాస్ కింద నూతనంగా 20 పరిశ్రమలు స్థాపించడానికి 42 రకాల అనుమతులను కమిటీ మంజూరు చేసిందన్నారు. రూ.59.47 కోట్ల పెట్టుబడితో 221 మందికి ఉపాధి కలుగుతుందని ఆమె వివరించారు. టీప్రైడ్, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 21 రకాల యూనిట్ల స్థాపనకు రూ.81 లక్షల రాయితీలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జోనల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీటీడబ్ల్యూఓ సౌజన్య పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

అధిక రాబడి పొందే పంటలను సాగుచేసేందుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ, పురోగతిపై సమీక్షించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఉషాదయాళ్, శ్రీనివాసరావు, ఏడీఏలు సురేశ్, నగేశ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) నాయకులు కలెక్టర్ సత్య శారదాదేవిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవిని కలెక్టరేట్‌లో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నయీమొద్దీన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫ్లోర్ లీడర్‌గా తోట వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యేలు, మేయర్‌తో వెంకటేశ్వర్లు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు(వెంకన్న) గురువారం బాధ్యతలు స్వీకరించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఫ్లోర్ లీడర్ కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పశ్చిమ, విలీన గ్రామాలకు చెందిన కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా, ఫ్లోర్ లీడర్ చాంబర్ ప్రారంభోత్సవానికి తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వలేదని కొంతమంది కార్యక్రమానికి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

మార్కెట్ కోసం స్థల పరిశీలన



హసన్‌పర్తి: నగరంలో వంద ఫీట్ల రోడ్డు పక్కన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కేయూ–వడ్డేపల్లి మార్గ మధ్యలోని లష్కర్ సింగారం సర్వే నంబర్ 266లో ఏడెకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని స్థానికులు తెలిపారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ఆయా కాలనీలకు చెందిన వారు ఇటీవల సీఎం గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టారు. స్థలాన్ని పరిశీలించి వెంటనే నివేదించాలని సీఎం గ్రీవెన్స్ నుంచి ఆదేశాలు అందాయి. ఈమేరకు గురువారం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రోజారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త దశరథం, వివేకానంద కాలనీ జనరల్ సెక్రటరీ బుర్ర విజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై విద్యార్థులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వరంగల్ / మామునూరు: ప్రకృతి విపత్తులు, మ్యాన్ మేడ్ డిజాస్టర్లు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ముందుజాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ జాతీయ విపత్తు నిర్వహణ దళం అవగాహన కల్పించినట్లు వరంగల్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ మామిడి భగవాన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలో ఫెమెక్స్‌లో భాగంగా గురువారం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన సదస్సులో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు, కమ్యూనిటీ బేస్డ్ వలంటీర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మామునూర్ ఏసీపీ బి.తిరుపతి, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రమేష్, స్టూడెంట్ అమ్నిటీ సెంటర్ విద్యార్థులు వరంగల్, హనుమకొండ, జీడబ్ల్యూఎంసీ అగ్నిమాపక అధికారులు ఏ.శ్రీనివాసరావు, ఎల్.దయాకర్, సుధాకర్‌రెడ్డి, మామునూరు సీఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీలో జిల్లాకు స్థానం



నయీంనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కమిటీలో వరంగల్ జిల్లాకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వేకెన్సీలను భర్తీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

వరంగల్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలను భర్తీ చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) బాధ్యులు వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతిని కోరారు. ఈమేరకు గురువారం వారు ఆమెకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయ పదోన్నతుల సందర్భంగా కొందరు రెండుమూడు ఆప్షన్లు ఇచ్చారని, సీనియార్టీలను అనుసరించి ఒక్కొక్కరు రెండుమూడు సబ్జెక్టులకు పదోన్నతులు పొందారని తెలిపారు. వారు ఎంచుకున్న సబ్జెక్ట్‌ల్లో జాయిన్ అయ్యాక ఏర్పడిన ఖాళీలు అర్హులకు అందకుండా పోయాయన్నారు. అందువల్ల లెఫ్ట్ ఓవర్ వేకెన్సీల్లో అర్హత గల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరాచారి, కోటేశ్వర్ రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలి



వరంగల్: మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఖిలా వరంగల్ : నులిపురుగుల నివారణ కోసం ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి సూచించారు. వరంగల్ 38వ డివిజన్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నులిపురుగు నిర్మూలన దినోత్సవం జరిగింది. డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ బైరబోయిన ఉమ, డీఈఓ వాసంతి, మండల పరశురాములు, హైమావతి, ప్రకాశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే ఏకాగ్రత

విద్యారణ్యపురి: పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏకాగ్రతతో చదువుల్లో రాణిస్తారని హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల పక్కనే ఉన్న లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాశాఖ, శిశు సంక్షేమ అధికారులతో కలిసి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మధురిమ మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం గురించి ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖలోని కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ బి.రాధ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అహ్మద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, గీత ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చార్‌బౌలి పాఠశాలలో..

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌలి పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీకేఎం ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

వరంగల్ జిల్లాలో 92 శాతం మందికి మాత్రలు

గీసుకొండ: వరంగల్ జిల్లాలో 92 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ తెలిపారు.

పేరిణితో కాకతీయుల స్ఫూర్తిని నింపాలి



పేరిణి నృత్య శిక్షణ శిబిరంలో కళాకారులు

వరంగల్: ఓరుగల్లులో పుట్టిన పేరిణి నృత్యాన్ని నేర్చుకుని ఖండాంతరాలు దాటించి కాకతీయుల స్ఫూర్తిని అందరిలో నింపాలని కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, నాగార్జున స్కూల్స్ చైర్మన్ ఆడేపు వెంకటేశ్వర్లులు సూచించారు. వరంగల్ రామనాథపురి కాలనీలోని నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పారంభమైన పేరిణి నృత్యం శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరిణి నృత్యం అంటేనే వరంగల్ కాకతీయులు గుర్తుకు వస్తారని, తెలంగాణ ప్రాంత శాస్త్రీయ సంప్రదాయ నృత్యమని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ శిబిరం నిర్వాహకులు చాతరాజు నవ్యజ, గజ్జెల రంజిత్‌కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పిల్లలమర్రి శ్రీధర్, దేవసాని భిక్షపతి, ఆడేపు వెంకటేశ్వర్లు, పల్నాటి శ్రీజ, బండారి వైష్ణవి, గురుదేవ్ సంతోష్, లోహిత్, కవిత, నృత్య సాధకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ తెలుగు, ఉర్దూ మీడియ పాఠశాల విద్యార్థులకు దర్గా సేవా సన్నిధి స్వచ్ఛంద సంస్థ వాట్సప్ గ్రూప్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. వాట్సప్ గ్రూప్ ముఖ్య అడ్మిన్ రాజన్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు రాధాకృష్ణ, సత్యనారాయణ, రామచంద్రం, సిరిమల రాధాకృష్ణ, కందగట్ల సత్యనారాయణ, చందు, రవిప్రసాద్, అడ్డగట్ల విజయ్, రామచంద్రం, మురళీకృష్ణ, ఎస్.శ్రీనాథ్, బి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, భిక్షపతి, రవీందర్, నాగార్జున పాల్గొన్నారు.

'సఖి'పై అవగాహన

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మ గుడిలో మహిళలకు సఖి సెంటర్ సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఆర్పీ స్వాతి ఆధ్వర్యంలో సఖి సెంటర్ సిబ్బంది కేస్ వర్కర్ వినీల, పారా మెడికల్ సిబ్బంది కరుణ మాట్లాడుతూ బాధిత మహిళలు, బాలికలు సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. సఖి ఆధ్వర్యంలో ఉచిత వైద్య, పోలీస్, న్యాయ, కౌన్సెలింగ్ సహాయంతో పాటు తాత్కాలిక వసతి అందించనున్నట్లు వివరించారు. బాధితులు 181 నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలన్నారు.

దేవాలయానిదే ఆ భూమి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాథస్వామి దేవాలయ భూమి తనదంటూ కోర్టును ఆశ్రయించిన వారిది కాదని, అది దేవాలయానిదే అని జిల్లా కోర్టు గురువారం తీర్పు ఇచ్చిందని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి తెలిపారు. ఆలయ భూమిలో 20గుంటల భూమి తనదంటూ కాశిబుగ్గకు చెందిన ఒకరు 2010లో కోర్టును ఆశ్రయించగా 2017లో దేవాలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినప్పటికీ ఆ వ్యక్తి మళ్లీ జిల్లా కోర్టును ఆశ్రయించగా తాజాగా దేవాలయానిదే ఆ భూమి అని తీర్పు వచ్చిందని రవి వివరించారు.

నాటక కళాకారుల సమస్యలు పరిష్కరించండి

హన్మకొండ కల్చరల్: నాటక సమాజాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, సభ్యులు తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు కమిటీ గౌరవ సలహాదారు బాద్మి శివకుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కమిటీ సభ్యులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణను కలిసి కళాకారుల సమస్యలు వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సాదు శ్యాంప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మారంరాజు రామచంద్రరావు, కోశాధికారి సూర్యవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సోమా అంజిరెడ్డి, రామాచారి, సుదర్శన్, మోహన్ ఉన్నారు.

టీజీ పీజీ ఈసెట్‌లో 'సెయింట్ పీటర్స్' ప్రతిభ

హన్మకొండ: 2024 –2025వ విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సులు ఇంజనీరింగ్ ఫార్మసీలో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ పీజీ ఈసెట్‌లో హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తమ కళాశాలకు చెందిన 81 మంది బీ ఫార్మసీ విద్యార్థులు పీజీ ఈసెట్ రాయగా 80 మంది విద్యార్థులు అర్హత సాధించారని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి తెలిపారు. తౌటం సాయికిరణ్ 89 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు, అదేవిధంగా 35, 50, 71, 105, 120, 138, 141, 198, 205వ ర్యాంకులతో పాటు మొత్తం 29 మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. హనుమకొండలో గురువారం నిర్వహించిన టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి బీఈడీ కలిగిన ఉపాధ్యాయులకు కూడా పదోన్నతికి అవకాశం కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టు తెప్పించి అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సూచించారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి, బాధ్యులు ఈదుల వీరస్వామి, మల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కాశిబుగ్గ / కేయూ క్యాంపస్/నయీంనగర్: నిత్యం యోగా చేస్తూ ఆహారపు అలవాట్లు మార్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి నుంచి వరంగల్ చౌరస్తా వరకు యోగా వాక్‌ను గురువారం నిర్వహించారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో యోగా ముఖ్య పాత్ర పోషిస్తోందని సర్జన్ డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.